



# మృత్యుహాక్కు

— చక్రవేణు

జానకి మంచంలో నుండి లేవలేకపోయింది. ఎంతగా పైకి లేవాలని ప్రయత్నించినా వీలు కావడం లేదు.

భర్త 'రఘునాథం' ఆఫీసుకు వెళ్లిపోయాడు. తెల్లవారిందిగా తనవైపు చూడనైనా లేదు. తన పరిస్థితి విచారించనూ లేదు. తెల్లవారుతూనే లేచి కాలకృత్యాలు తీర్చుకొని, హోటల్‌కెళ్లి తృప్తిగా టిఫిన్ తిని, కాఫీ సేవించి ఇంట్లో మరో ప్రాణి వుందని తలవకుండానే చక్కగా ఆఫీసుకెళ్లాడు రఘునాథం.

జానకి శరీరమంతా పచ్చిపుండులాగ వుంది. వీపంతా కమిలిపోయి, నొప్పి తీవ్రంగా సలుపుతూ మనసులో పిచ్చి పిచ్చిగా ఆలోచనలు కలుగుతూ వుంటే మెదడు వేడెక్కి బద్దలైపోతున్నట్లుంది. రాత్రి సంఘటన గుర్తుకొస్తుంటే, పదే పదే ఆలోచన మీద ఆలోచన సాగుతూ మనసులో సుళ్లు తిరుగుతుంటే, కళ్ల కొనల నుండి కన్నీరు కారి కారి చారలు కట్టి

కళ్లన్నీ ఉబ్బిపోయి వెం్రుకలన్నీ చెదరి, శోక దేవత పూనినట్లు దిగాలుపడి మంచంలో పిచ్చిదానిలా కూలబడి వుంది.

జరిగినదంతా పదే పదే గుర్తుకు తెచ్చుకుంటూ 'జానకి' బాధపడుతూ వుంది. నెల రోజులుగా చిలికి చిలికి చిన్నగా సాగుతూ వచ్చిన భర్త పోరు ఆ రోజు రాత్రి తీవ్రమై, తుఫానులాగా తన మీద పడడాన్ని గురించి ఆలోచిస్తూ వుంది.

గతమంతా చిత్రంగా తన కళ్ల ముందు కదులుతూ వుంది.

"జానకీ ఇదిగో! నీకో శుభవార్త! ఇట్లారా." కేరింతలతో పేపరు చేతిలో పట్టుకొని వచ్చిన భర్తను చూసి అంత ఆప్యాయంగా పిలిచిన 'జానకీ' అనే పిలుపు విని సంభ్రమాశ్చర్యంతో విశ్చేష్టురాలైంది జానకి. జానకి ఆశ్చర్యం నుండి తేరుకొని "ఎవరికండీ శుభవార్త. మీకా, నాకా?" అంది.

జానకి వేసిన ప్రశ్న లాంటి సమాధానం విని తన ఆనందం ఒక్కసారిగా మాయమై, తిరిగి తన కసాయి రూపాన్ని సరిచేసికొని కృత్రిమ నవ్వు అభినయిస్తూ.

"అదేందోయ్! నాకు శుభవార్త అయితే అది నీకు మాత్రం కాదా!" అన్నాడు.

రఘునాథం అంత సంతోషంగా చెబుతున్నాడంటే, అది అతనికి మాత్రమే శుభవార్తయి వుంటుంది. తనకు మాత్రం కాదు అని జానకి మనసు రూఢీగా చెబుతోంది.

"సరే అదేదో చెప్పండి మరి వింటాను", ఇక తప్పదనుకొని నిరుత్సాహంగానే పలికింది జానకి.

"ఇక మీదట మీ ఆడవాళ్లకు పుట్టింటివారి ఆస్తిలో వాటా వస్తుంట. గవర్నమెంటు చట్టం చేసింది, అమలుకు కూడా వచ్చేసింది. ఇదిగో పేపర్లో వార్త వేశారు చూడు."

ఆ రోజు పేపర్లో వేసిన వార్త చూపించాడు రఘునాథం.

పేపర్లో వార్త చదువుతూ వుంటే జానక్కి ఏ మాత్రం ఆనందం కలుగలేదు. చేతులు ఒణికాయి. శరీరమంతా చెమటలు పట్టేసాయి. తలమీద పిడుగు పడ్డట్టయింది.

జానకి ముఖంలో మార్పులు గమనిస్తున్న రఘునాథానికి, ఆమె దేని గురించి మథనపడుతూ వుందో, దేని గురించి సంతోషించక బాధపడుతూ వుందో దానితో పనిలేదు. ఎలుక ప్రాణంతో పిల్లి చెలగాటమాడినట్లుగా, లేడిపిల్ల కన్నీటికి వేటగాడు కనికరం చూపనట్లే, గోమాత ఘోషపై రక్తం రుచి మరిగిన పులికి జాలిలేనట్లే, మానవ మృగాలలో కసాయి రాక్షస మగజాతికి వారసుడైన రఘునాథానికి జానకి బాధతో పనిలేదు. తనకు కావలసినదల్లా ఆమె ద్వారా లాభం పొందడం మాత్రమే. దానిపై ఆమె ఇష్టాయిష్టాలతో పనిలేదు, అది తాను చెప్పినట్లు జరిగితీరాలి.

"ఏమే, శుభమైన వార్త తెచ్చి చూపించితే సంతోషించక, మీ అబ్బ గంటు పోయినట్లు ముఖమంతా మాడ్చేసి, దిగేసుకున్నావే!" రఘునాథానికి మనసులో కోపం రగులుతూ వుంటే పైకి అనేశాడు.

'మా అబ్బ గంటుకాక మీ అబ్బ గంటా పొయ్యేది? నీ వెనకల మీ అమ్మకు కూడా ఇద్దరు ముగ్గురన్నా ఆడబిడ్డలు పుట్టుంటే కట్నాల బాధ, కానుకల బాధ తెలిసేది. వాళ్లను సాగనంపినాక అల్లుళ్ల బాధ తెలిసుండేది. అదేదీ లేదు కాబట్టే, నన్నూ, నా పుట్టింటినీ దుంప తెంచుతున్నావు" అని మనసులోనే గొణుక్కొంది జానకి.

"ఏమే మూసంగి ముండా, నేను చెప్పేదేమన్నా యినపడతా వుందా లేదా! ఊరికే మూగెద్దులాగా నిలబడినావే! హా! శనిముండా, చూడు దరిద్రపు ముఖం. ఎక్కడ దాపురించిందో ఏమో, దీన్ని నా కంటకట్టినారు" జానకిని కసురుకున్నాడు రఘునాథం.

"నీ దగ్గరికి తోసినందు వల్లే, నా ఆనందమంతా మాయమై, వున్న కాస్త స్వేచ్ఛ కూడా తొలగిపోయి, బంధిఖానాలో ఇరుక్కున్నట్టు తయారై, పశువుకన్నా హీనంగా ఎంత బాధనైనా భరించడమేకాని, చెప్పుకోలేని, ప్రతిఘటించలేని దానిగా తయారయ్యా"నని తలచుకొనేటప్పటికి జానకికి దుఃఖం వచ్చింది. భర్త తిట్టే తిట్లతో భరించలేక కొంగు నోటికి అడ్డం పెట్టుకొని ఏడ్చేసింది.

రఘునాథం ఊహించినదంతా తారుమారైంది. తాను తీసికొనివచ్చి చెప్పిన వార్త విని తన భార్య సంతోషించక, మౌనంగా వుంది. ఇప్పుడు ఏడ్పు మొదలెట్టగానే భార్యపైన కోపం తారాస్థాయికి చేరింది. మరింత రెచ్చిపోయాడు. కూర్చున్న వాడల్లా అమాంతం మీదపడి, చేతిబలం కొద్దీ పశువును కొట్టినట్లు కొట్టాడు.

నా ఎదురుగా నిలబడగాకు ఫో... ఏడుపులంజా ముండ" మెడపట్టి తోశాడు.


భర్త తోసిన తోపుకు గోడపై తూలిపడి, పైకి లేచి ఏడుపు దిగమింగుకుంటూ, వంటింట్లోకి పోతూ వుంటే, రఘునాథం ఆవేశంతో బుసలు కొట్టాడు.

"నీ దొంగ ఏడుపులూ, ఎత్తులూ నాకు బాగా తెలుసు. నీ అమ్మగారి సొత్తు ఏ మాత్రం అత్తగారికి రాకూడదనేదే నీ బుద్ధని, నాకు ముందుగానే తెలుసు. నీ వాళ్లు నన్ను నమ్మించి అనిస్తాం, ఇనిస్తాం అని చెప్పి శనిముండను నిన్ను నా నెత్తికి తోసినారు. నువ్వు ఆహా ఎంత హాయిగా వుందిలే అనుకొని, నా కొంపలో తిష్టవేసి నన్ను ముంచుతున్నావు"

రఘునాథం తన మనసులో అణచుకున్న అక్కసును పైకి వెళ్లగక్కాడు.

జానకి నోరెత్తకుండా గోడకానుకొని వెక్కి వెక్కి ఏడుస్తూ బొమ్మలాగ నిలబడింది.

"కాలు కదపనీకుండా తెచ్చి ఇంట్లో వేస్తే వుంటే తిని గున్నేనుగులాగ కులుకుదామనుకుంటున్నావేమో. ఇదిగో మర్యాదగా చెబుతున్నా, నాకు రావలసిన ఇరవై వేలు రూపాయల కట్నంలోకి మీ వాళ్లిచ్చింది పదివేలే, అందులోకి మిగిలిన పదివేల రూపాయలూ, నీకు చేయిస్తానన్న నాలుగు తులాల బంగారు నగలూ చేయించనే లేదు. ఏదో బాధల్లో వుండారు పోనీలే అనుకొని ఇంతకాలం మర్యాదిచ్చినాను. ఇంకెంత మాత్రం ఓర్చుకొనేది లేదు. కాబట్టే నువ్వు వెంటనే మీ పుట్టింటికి పోయి నాకు రావలసిన డబ్బులూ, నగలుతో సహా, నీకు వచ్చే ఆస్తిలో వాటా పంచుకొని తీసికొనివస్తే సరి, లేకుంటే నీవు నా యింటికి రావద్దు. నీ అమ్మగారిం



ట్లోనే వుండిపో. ఈ ఇప్పుడే, ఈ క్షణమే బయలుదేరి పోవాలి. ఇక ఎంతమాత్రం ఆలస్యమైనా ఒప్పుకోను. ఇదిగో చార్జీలకు డబ్బులు... తిరిగి నేను వచ్చేటప్పటికి నువ్వు ఇక్కడ వుండకూడదు."

రఘునాథం పాకెట్‌లో డబ్బులు తీసి జానకి పైకి విసిరికొట్టి, రుసరుసలాడుతూ బజారు వైపు వెళ్లి పోయాడు.

భర్త మాటలు విని చలనం లేకుండా కాసేపు ఘాప్పడిపోయింది జానకి. గోడకు జారి గొంతు కూర్చుంది. మోకాళ్లపై తలవాల్చి వెక్కి వెక్కి ఏడ్చింది. అలా ఎంతసేపైందో ఏడ్చి, ఏడ్చి నేలమీద సొమ్మసిల్లి పడిపోయింది. ప్రక్క ఇంటి 'సుశీలక్క' వచ్చి లేపిన తర్వాతకాని తనకు మెలకువ రాలేదు.

తనను చెల్లెలితో సమానంగా చూసుకొనే సుశీలక్కను చూసి పట్టుకొని ఏడ్చేసింది జానకి. ఆ రోజు జరిగినదంతా పూసగుచ్చినట్టుగా సుశీలక్కకు వివరించింది.

సాయంత్రం మూడు గంటలవుతున్నా కూడా రఘునాథం యింటికి రాలేదు. జానకి ముఖం కడుక్కొని సుశీలక్క బలవంతం చేస్తే కొద్దిగా అన్నం తినింది. ప్లాస్టిక్ బుట్టలో గుడ్డలు సర్దుకొని, పుట్టింటికి పోవడానికి బస్టాండుకు బయలుదేరింది.

జానకి బస్సులోకి ఎక్కి కూర్చుందేగాని మనసు మాత్రం, తనకన్నా ముందే పుట్టినిల్లు చేరుకొనింది. పుట్టింటి గురించిన ఆలోచనలలో మునిగిపోయింది.

తండ్రి చనిపోయిన తర్వాత కుటుంబ భారమంతా తల్లి లక్ష్మమ్మ మీద పడింది. తన పెళ్లి గురించి దిగులు పడి గుమ్మటం లాగుండిన తల్లి, తన కళ్ల ముందే కరిగి పోయి కట్టెలాగా అయింది. ఎట్టకేలకు తన పెళ్లిచేసి, తల భారం కాస్త దించుకున్నా, తన వెనకటిది చెల్లి 'రాణి' పెళ్లీడుకొచ్చి మరో కుంపటిలాగా వుండనే వుంది. ఆ భారం ఆమె గుండెల మీద రోజు రోజుకూ పెరుగుతూ వుంది. ఆఖరివాడు తమ్ముడు గోపీ పదవ తరగతి చదువుతున్నాడు. వాడికంత చిన్న వయసులోనే కుటుంబ బాధల గురించి ఆలోచించాల్సి వచ్చింది. ఇక పెదనాన్నగారి కుటుంబం అంతో యింతో ఆదుకోబట్టే తల్లి ఇపుడున్నంత మేరకైనా సేద్యం చేయించకలుగుతా వుంది. లేకుంటే ఆ కాస్త భూమి కూడా ఎప్పుడో అమ్మేయాల్సొచ్చేది. తాను, చెల్లెలు రాణి పదివరకన్నా చదవకలిగా[illegible]. ఇక తమ్ముడు 'గోపీ'ని ఆ పదవ తరగతన్నా పూర్తిచేయించడానికి తల్లికి శక్తి వుందో లేదో! పోనీ పట్నంలో తన దగ్గరే వుంచుకొని వాడ్ని చదివించుదామంటే ఆ పని చేయడానికి తనకు హక్కు లేదు. తమ్ముని భవిష్యత్తు తల్చుకొని బాధ పడడమే కాని, తాను ఏమీ చేయలేని నిస్సహాయురాలు.

జానకి అట్లా ఆలోచిస్తూ వుండగానే ఊరి స్టాపింగ్‌లో బస్సు ఆగింది. ఆత్మ సంఘర్షణలో నుంచి ఒక్కసారిగా ఉలిక్కి పడి బాహ్య ప్రపంచంలోకి వచ్చింది.

బస్సు దిగి యింటివైపు నడక ప్రారంభించింది. పొయ్యి మంట చేస్తున్న 'రాణి', అక్క రావడాన్ని చూసింది. సంతోషాన్నంతా కళ్లల్లోకి తెచ్చుకొని "అమ్మా అక్క వచ్చిందే" అంటూ వాకిట్లోకి ఎదురేగి జానకి చేతిలోని వైరు బుట్టను అందుకొనింది.

"ఒక్కదానివేనా! బావ రాలేదాక్కా" రాణి ప్రశ్నించింది.


"ఆయనకు పనుండి రాలేదులే" చెల్లెలికి చెప్పి, తల్లిని పలకరించడానికి మంచం దగ్గరకు వెళ్లింది.

"బాగుండావా అమ్మా, ఆరోగ్యం ఎట్లుంది?"

జానకి తల్లిని ఆప్యాయంగా పలకరించింది.

మంచంలో పండుకోనున్న లక్ష్మమ్మ బిడ్డను చూడగానే, నీరసమంతా పోయి, ఎక్కడ లేని బలం వచ్చి నట్టుగా పైకి లేచి కూర్చుంది. బిడ్డను కౌగలించుకొని.

"బాగా చిక్కిపోయావు. తిండి సరిగ్గా తింటున్నావా లేదా అమ్మే" అని బిడ్డను తడిమి తడిమి చూసింది.




జానకి తల్లి ఆప్యాయతలో, మరోసారి బాల్యంలోకి వెళ్లింది. బిడ్డను చూసి మురిసిపోయినా, అల్లుడు రాకుండా ఒక్కతే వచ్చినందులకు అనుమానపడింది తల్లి లక్ష్మమ్మ.

"జాబు గీబు ఏమీ లేకుండా చెప్పా పెట్టకుండా ఒక్కదానివే వచ్చినావు. 'రఘు' రాలేదేమమ్మే. కొట్లాడిగానీ వొచ్చినావా ఏమి!'

లక్ష్మమ్మ తన అనుమానం తీర్చుకోవడానికి జానకిని అడిగింది.

జరిగిన విషయం తల్లికి తెలియపరచి, ఆమె మనసును బాధ పెట్టడం ఇష్టం లేక, ఆమెకు అనుమానం రాకుండా వుండాలని, లేని సంతోషాన్ని తెచ్చిపెట్టుకొనింది జానకి.

"అబ్బే అదేం లేదమ్మా, ఆయన పనిమీద క్యాంపు కెళ్లాడు, సరే వారం రోజుల వరకూ నేను ఎట్లాగూ రాలేను కదా! మీ అమ్మగారింటికాడికి పోయి వుండమని, ఆయన చెబితేనే వచ్చినాను."

తల్లి తృప్తి కోసం జానకి అబద్ధాన్ని కల్పించక తప్పింది కాదు.

"అవునమ్మా ఇంతసేపు మరిచేపోయాను. 'గోపీ' ఎక్కడకు పోయాడు, కనబడనే లేదు. బడికిపోయి ఇంకా రాలేదా?" జానకి తమ్ముడిని గురించి అడిగింది.

గోపి చదువు సంగతి వచ్చేటప్పటికి, లక్ష్మమ్మకు కళ్లల్లో నీళ్లు తిరిగాయి. పైకి కనబడ నివ్వకుండా మెలిగింది.

"ఏమి చదువులు జానకీ, చదివినోళ్లకంతా ఉద్యోగాలు వస్తున్నాయా ఏమన్నానా, బికారిగా తిరగతా వుంటే చూస్తా వుండాము కదా! అంతెందుకు మీ పెదనాయన కొడుకుండాడు కదా, ఆ వేణుగాడు బి.ఏ.నో ఎమ్మేనో అంత పెద్ద చదువు చదివి కాళీగా పడుండ్లా! మరి మనలాంటోళ్లకు ఆ చదువులు ఏమి మేలు చేస్తున్నాయి. అందుకే మన గోపీకి ఇపుడు చదివిన చదువు చాల్లే అనుకొని నిలిపిచ్చేసి మెకానిక్కు పని నేర్చుకోరా అని చెప్పినా! పోయిన నెలలోనే మీ పెద నాయన టౌన్‌కు తీసకపోయి ఎవరిదో తెలిసినోళ్లది మోటారు షెడ్డంట, అక్కడ పనిలో పెట్టొచ్చినాడు. వాళ్లే అన్నం గిన్నం అన్నీ పెట్టి పైగా నెలకు నూరు రూపాయిలు చేతికిస్తున్నారు. అదే చాల్లే వాడు అట్లే బతికి పోతాడు"

తల్లి లక్ష్మమ్మ బాధనంతా గుండెల్లో దాచుకొని పైకి మాత్రం ఏమీ బాధ లేనట్లే కూతురితో చెప్పింది.

తల్లి తన సంసారంలోని ఈతి బాధలు బిడ్డకు తెలియకూడదని, బిడ్డ సంసారం చక్కగా సాగితే అంతే చాలనుకుంటుంది. బిడ్డ కూడా తన అత్తింటి కాపురంలోని బాధలన్నింటినీ దిగమింగుకొని, చక్కగా మూడు పువ్వులూ ఆరు కాయలుగా సంసారం సాగిస్తున్నట్లు

## జలపాత గీతావిష్కరణం

నాకు తెలుసు
నేను మాటలు పోగేయటం మొదలు పెట్టేనంటే
గాలి వాటుకు సాగిపోయే
మబ్బు ముక్కలా తేలిపోతానని
నా ఉనికినీ, అస్తిత్వాన్నీ కోల్పోతాననీ
అయినా నా అహాన్నీ ఆధిక్యతనీ వెదజల్లుతూనే వుంటాను
నాకు తెలుసు
అవతలి వాడు మౌనాన్ని ధరించాడంటే
మంటల్నీ, అవమానాల్నీ, సముద్రాల ఆవేశాల్నీ
మూటకట్టి జీవితం మీద కెక్కించుకొని
ఎంతో ఓర్పుగా మోస్తున్నాడనీ
కరుణాళువై చిగురించబోతున్నాడనీ.
నూతిలోని కప్పలాగ ఉభయ తారకంగా చరిస్తూ
నిమ్నా నిమ్నా కూడ గట్టుకొని
మెట్టు మీంచి మెట్టుకి ఎగ్రబాకుతుంటాన్నేను
వాడు మౌనాన్ని ముక్కలు ముక్కలుగా కరిగిస్తూ
జీవనాన్ని లక్ష్యాల గవాక్షానికి గురిపెట్టి పదును తేలి వుంటాడు
చూపుల్ని సూర్యకిరణాల్లా మలుస్తాడు
ఆలోచనల్ని అవిశ్రాంతంగా పండిస్తాడు
మొన్న మొన్నటి వరకూ నా పాదాల వద్ద పాకుతూ పాకుతూనే
ఒక్కసారిగా గెలుపు మీద రెపరెపమని ఎగురుతాడు
భూమీ ఆకాశమూ పట్టేంతటి స్వేచ్ఛా గీతాల్ని లిఖిస్తాడు
జనం గుండెల మీంచి జలపాతంలా దొర్లుకొస్తాడు
అప్పుడు కాలం వాడినొక పాఠశాల చేసి ఆవిష్కరిస్తుంది
నేనొక గడ్డిమొక్కగా ఎక్కడో కూరుకుపోతా.

- ఆదూరి సత్యవతీదేవి

తల్లిని మెప్పిస్తుంది.

విశ్వసృష్టికే తాను కర్తగానూ, కర్మగానూమారి మానవతకు మాతృమూర్తి తానై, మానవ జగత్తులో అదనపు భారాన్ని మోస్తున్న స్త్రీ, తల్లి బిడ్డగానూ, బిడ్డ తల్లిగానూ బాధల్ని భరించడంలో అలవాటు పడి బండబారి పోయింది. ఈ సత్యాన్ని సంసార అనుభవంతో తల్లి లక్ష్మమ్మ గుర్తించినా, ఆ అనుభవాన్ని బిడ్డకు పాఠంగా చెప్పకపోయినా, జానకి తనకు తానుగానే అనుభవం నుంచి నేర్చుకొని అందరిలాగానే తానూ 'భరింప బడుతూ' వుంది.

తమ్ముడి చదువు ఆగిపోయినందుకు, మనసులో ఎంత బాధ వున్నా ఏమీ అనలేకపోయింది జానకి.

భర్త తనను పుట్టింటి ఆస్తిలో వాటా పంచుకొని రమ్మని పంపాడే కాని, పుట్టింటి బాధల్ని ఆదుకొమ్మని పంపలేదు కదా! అది జానకికి తెలుసు కనుక, ఓదార్పు కొరకైనా పెదవి విప్పలేకపోయింది.

భోజనాలన్నీ అయ్యాక, తల్లి లక్ష్మమ్మ ఇంటి ముందు వాకిట్లో పందిరి కింద మంచం వేసికొని పడుకొంది.

అక్కా చెల్లెళ్ళిద్దరూ ఇంటి వెనుకతట్టు లోపక్క దొడ్లో మంచం వేసికొని మాటల్లోకి దిగారు.

"అవునే రాణీ ఈసారి మన సేలో, మడి నాటి నారా, లేక సద్దపైరు పెట్టినారా అమ్మే"

అని జానకి చెల్లెల్ని అడిగింది.

చెల్లెలికి, తాను వచ్చిన పని గురించి తెలిపి, ఆస్తి వాటా గురించి చర్చిస్తే ఏమంటుందో చూద్దాం అనుకొని, జానకి చెల్లెల్ని కదిపి చూసింది.

"వెనక్కాయ కొంచెం వేసి, మిగిలింది సద్దపైరు పెట్టినారు" రాణి జవాబిచ్చింది.

"ఈసారి మన బాకీలు సగమన్నా తీరిపోతాయంటావా!" జానకి ప్రశ్నించింది.

"బాకీలా, అవి తీరేదీ లేదు పోయేదీ లేదు. షావుకారి పెద్ద సుబ్బయ్య దగ్గర నాయన చేసిన బాకీ ఇరవై వేల రూపాయలూ అట్లనే వుందంట, రెండేండ్ల నుంచి నీ పెండ్లికి చేసిన అప్పు ఇరవై వేలు అసలు వడ్డీలోకి కూడా పైసా తీరలేదంట. వడ్డీ సంవత్సరమూ కొండ పెరిగినట్లు పెరుగుతూనే వుండాదంట. అందుకని పెద నాయన పోయి వాళ్లతో మాట్లాడి, వడ్డీ గిడ్డీ ఏమి లేకుండా అసలు వుండేటట్టుగా మాట్లాడి, వడ్డీకి బదులుగా మన భూమి, మోటారూ అన్నీ కలిపి పెద్ద సుబ్బయ్యగారికి అగ్రిమెంటు రాపించినాడు. మనము ఎప్పుడు అసలు డబ్బు కడతామో అప్పుడు మన భూమి మనకే వదిలిపెట్టేస్తారు. అంతవరకూ అది వాళ్లే అనుభవించుకుంటారంట అక్కా"

రాణి ఆ విషయాలు అంత తేలికగా చెబుతా వుంటే, జానకికి మతి పోతున్నట్లయింది.

కాని తన చెల్లెలికీ, తల్లికీ ఆ విషయం మామూలుగా వున్నట్లుంది.

ఏ ఆస్తిలోనైతే వాటాపంచుకొని, తన పుట్టింటిని నట్టేట్లో ముంచిరమ్మని, భర్త పంపించాడో అదే ఆస్తి కోసం వడ్డీ వ్యాపారి గుంటకాడ నక్క కాపలా వున్నట్టు వున్నాడు.

ఒక వైపు వడ్డీ వ్యాపారీ, మరో వైపు తన భర్తాఇద్దరూ కూడా ఒకే జాతి మృగాల్లాగా జానకికి కనుపించారు.

భూమి తాకట్టులో వుందని తెలిశాక, ఆస్తిలో వాటా కోసమే తాను వచ్చానని చెల్లెలికి కూడా జానకి చెప్పలేకపోయింది.

తాను ఇంటికి పెద్ద బిడ్డగా పుట్టినందులకు, ఇంటి బాధల్ని పంచుకొని తల్లి మోసే భారాన్ని, తాను కూడా తోడై సహకరించ వలసింది పోయి, ఆడబిడ్డలైనందుకు పుట్టింటిని అప్పుల్లో ముంచి పోయానని తలచుకొనేటప్పటికి జానకికి దుఃఖం ఆగింది కాదు.

"రాణీ నా కోసం మిమ్మల్ని కష్టపెట్టి ఇంటిని అప్పులపాలు చేసి, నీకూ తమ్ముడికీ అన్యాయం చేసినానమ్మే" అని చెల్లెల్ని పట్టుకొని జానకి భోరున ఏడ్చేసింది.

రాణికి కళ్ళల్లో నీళ్ళు దిగినా, ఆపుకోకలిగి తిరిగి అక్కనే ఓదార్చింది.

"ఊరుకో అక్కా ఏడ్వమాకు, ఏడ్పు మాత్రం మనం చేసేది ఏమీ లేదు. నా మటుకు నేను ఏ పొద్దో గుండెను రాయి చేసుకున్నానక్కా. ఇప్పుడు నాకు పెళ్ళి చేసుకోవాలని కూడా ఏ కోశానా అనిపించడం లేదు. పెళ్ళి చేసుకోకూడదనే నిర్ణయానికి వచ్చినాను... ... నిజంగా నా మనస్ఫూర్తిగా చెబుతున్నాను. మా బాధలు ఎన్ని వున్నా పరవాలేదు. నీ సంసారం సుఖంగా సాగితే అంతే చాలక్కా!"

చెల్లెలు ధైర్యంగా, కొండంత నిబ్బరంతో వెలిబుచ్చిన చెల్లెలి మాటలు విని జానకి చలించిపోయింది.

"నాకోసం మీరింత త్యాగం చేసినా, అత్తింటి కోడలుగా నా బతుకు మాత్రం సుఖంగా లేదు చెల్లీ!" అని మనసులో అనుకొని కుమిలి కుమిలి ఏడ్చింది

జానకి..

జానకి అక్కడ వున్న ఐదు రోజులలో పుట్టింటి విషయాలు ఎన్నో తెలుసుకొంది. అందుకే భర్త కోరినవి ఏవీ అడగలేక పోయింది. వచ్చేటప్పుడు ఎంత బాధతో వచ్చిందో, అంతకు రెండింతలు బరువును మోస్తున్నట్టు భర్త దగ్గరకు బయలుదేరింది.

ఆదివారం శెలవు కాబట్టి రఘునాథం మధ్యాహ్నం వరకు ఫ్రెండ్స్‌తో పేకాట ఆడి, బ్రాందీని సేవించి హోటల్లో బిరియాని తృప్తిగా ఆరగించి, నడవడానికి వీలుగాక రిక్షా ఎక్కి ఇంటి దగ్గరదిగాడు. రిక్షా అతనికి కరెక్టుగా చిల్లర లెక్కపెట్టి ఇచ్చి, ఇంట్లోకి తూలుతూ వెళ్ళి అత్తగారిచ్చిన పట్టెమంచం పరుపుపై వాలిపోయాడు.

జానకి బస్సు దిగి ఇంటికి వచ్చేటప్పటికి పొద్దు కుంకిపోయింది. అప్పటికి కూడా రఘునాథంకు తాగిన మత్తు దిగలేదు. అందుకని పైకి లేవలేదు.

భర్త ఆ సమయానికి ఇంటి వద్ద వుండడం జానకికి ఆశ్చర్యం వేసింది. పులి గుహలోకి అడుగు పెడుతున్నట్టు భయం భయంగా అడుగులు తడపడుతూ ముందుకు కదిలింది. వాకిట్లోనిల్చుని కాసేపు పిలవడానికి తటపటాయించింది.

"ఏమండీ తలుపు తీయండి"

అంటూ పదిసార్లు పిలిచాకగాని రఘునాథానికి మెలకువ రాలేదు.

"ఎవరూ... ఏమి కావాలి" గొణుగుతూ వచ్చి తలుపు తెరిచాడు. ఎదురుగా వున్న జానకిని చూశాడు.

"ఏమే నోరేమన్నా పడిపోయిందా! నేనని చెప్పలేవూ?"

అని గదమాయించాడు రఘునాథం.

ఎర్రగా చింతనిప్పుల్లా మెరుస్తున్న భర్త కళ్ళను చూసి, తలదించుకొంది జానకి.

భర్త నోటి నుంచి బ్రాందీవాసన గుప్పుమని పోకింది. భర్త పక్క నుండి ఒదిగి ఒదిగి లోపికెళ్ళింది జానకి.

భర్త ఏమడుగుతాడు? ఏమడిగితే ఏమి సమాధానమివ్వాలి? ఏమి చెబితే, ఏమి జరుగనున్నదో అని ప్రశ్నలు పుట్టుకొస్తుంటే జానకికి గుండెదడ మరింత ఎక్కువైంది. కొద్దిసేపు ఇద్దరూ మౌనంగా వుండిపోయారు.

కొద్దిసేపటికి మౌనాన్ని బద్దలు చేస్తూ నోరు గంభీరంగా వాగడం మొదలైంది.

"ఏమే ఆస్తిలో వాటా రాయించుకొనొచ్చావా, నీ వాటా ఎంతొచ్చింది? కట్నం బాకీ పదివేలు తెచ్చినావా! చేయిస్తామన్న నగలు చేయించినారా!?"

రఘునాథం కంఠస్థం చేసినట్లు అడుగుతూ వుంటే జానకి ఏమీ చెప్పలేక నిలబడిపోయింది.

"ఏం? నేనడిగేది వినిపిస్తా వుందా, లేదా?" గర్జించినట్లు అడిగాడు.

"లేదండీ మా అమ్మావాళ్ళు చాలా ఇబ్బందుల్లో వుంటే అడగలేక వచ్చేశాను."

జానకి నోట్లో నుంచి ఆ మాట పూర్తిగా రాకముందే రఘునాథం చేయి జానకివీపు మీద పడిపోయింది. గొడ్డును బాదినట్లు బాదేశాడు. తన కసినంతా జానకి వీపు మీద తీర్చుకున్నాకగాని తృప్తి కలగలేదు.

"వెధవ లంజముండా, ఛార్జీలకు డబ్బులిచ్చి నిన్ను పంపించింది నీ వాళ్ళ క్షేమాలు కనుక్కొని రావడానికంటవే..?"

కట్నం డబ్బులు, చేయిస్తామన్న బంగారు నగలు, భూమిలో వాటా ఇస్తేనే రా, లేకుంటే నా ఇంటికి రాగాకని చెప్పలేదా! వాళ్ళు బాధల్లో వుంటే నాకేమి, వాళ్ళు చస్తే నా కేమి? అల్లుడు తేరగా దొరికాడు అనుకొనిందా మీ అమ్మ? పెండ్లయిన రెండేండ్లకూడా కట్నం కానుకలు పూర్తిగా చెల్లించకుంటే నలుగురూ ఊస్తారని కూడా మీ అమ్మకు సిగ్గేయులేదా... ... ధూత్... మీ వంశమే సిగ్గులేని వంశం."

జానకి ముఖాన ఎంగిలి కేకరించి ఊసేసి, సరసరమని బయటకెళ్ళిపోయాడు రఘునాథం.

ముఖానపడిన ఎంగిలి కొంగుతో తుడిచేసికొని వెక్కి వెక్కి ఏడ్చిందేకాని ఒక్కమాటైనా ఎదిరించి అడగలేక పోయింది జానకి.

సుశీలక్క వాకిట్లో బొమ్మలాగా చూస్తూ నిలబడిపోయింది. రఘునాథం రాక్షసత్వానికి జడిసి, అడుగుముందు కేయలేకపోయింది.

రఘునాథం బయటకెళ్ళిపోగానే సుశీలక్క పరుగెత్తుకుంటూ పోయి, బిడ్డను కౌగిట్లోకి తీసుకున్నట్టు జానకిని ఓదార్చింది.

సుశీలక్క ఆ రాత్రంతా అక్కడనే వుండాలనుకొంది. జానకికి తగిలిన గాయాలను వెన్నతో కాచింది. రాత్రి రెండు గంటల సమయంలో రఘునాథం ఇంటికొచ్చాడు. సుశీలక్క మనసు జానకిని అటువంటి సమయంలో విడిచి రావడం ఇష్టం లేకున్నా, రఘునాథం ముందు వుండేదానికి వీలులేక ఇంటికొచ్చేసింది.

తన కోసం అప్పటి దాకా ఎదురుచూస్తూ మేలుకొని, వున్న భర్త శ్రీనివాసరావును చూసి, సుశీలక్క మనసులోనే అభినందించింది.

"సుశీలా ఆ అమ్మాయికి ఎట్లుంది? ఆహారం ఏమైనా తీసికొందా లేదా?" శ్రీనివాసరావు సుశీలక్కను అడిగాడు.

"బలవంతం చేస్తే కొద్దిగా తింది. ఐనా ఆ రఘునాథం చూడబోతే మనిషి లాగా కనుపించడం లేదండీ. గర్భవతి అనే విచక్షణ కూడా లేకుండా, పశువును బాదినట్లు కొట్టాడు. వాళ్ళు యిచ్చిన కట్నం చాలక, ఆ పిల్ల యిప్పుడు ఆస్తిలో వాటా తీసికొని రాలేదని, దానిని కాల్చుకుతింటున్నాడు. ఆడదాని బతుకంటేనే అధ్వాన్నమైపోయింది. ఆడదానిని కుక్కకన్నా హీనంగా చూస్తున్నారు ఈ మగవాళ్ళు. ఛీ... అసలు వీళ్ళు మనుషులేనా అనిపిస్తా వుంది."

"అందరు మగవాళ్ళూ రఘునాథంలాగానే వుంటారంటావా సుశీలా!"



శ్రీనివాసరావు సుశీలక్క మాటలను అడ్డుకొంటూ ప్రశ్నించాడు.

"అందరు మొగవాళ్ళూ అని నేననడం లేదు. కానీ ఎక్కువమంది రఘునాథం లాంటి వాళ్ళే ఉంటున్నారు" సుశీలక్క తడబాటు లేకుండా ఖండితంగా చెప్పింది. చర్చ మొదలుపెడితే సుశీలక్క మాత్రం వెనక్కి తగ్గేది కాదు. కావాలంటే ఆధారాలతో సహా రుజువు చూపించేరకమని శ్రీనివాసరావుకు బాగా తెలుసు. అందుకే అంతటితో ఆ విషయం ముగించడం మంచిదనుకున్నాడు.

"మళ్ళా ఆ విషయంపై చర్చ మొదలుపెడితే తెల్లవారిపోతుంది. ఇక పడుకో."

శ్రీనివాసరావు ప్రశాంతంగా అన్నాడు.

తన ఆవేశాన్ని గుర్తించే భర్త అట్లా అంటున్నాడని సుశీలక్క గుర్తించింది. భర్తను మనసులోనే అభినందించింది.

* * *

తెల్లవారింది మొదలు జానకి మంచం పైనుండి లేవకుండానే జరిగినవన్నీ తలచుకుంటూ దుఃఖిస్తూంది. కన్నీళ్ళతో చెంపలు తడిసిపోయాయి. మంచంలో నుండి లేవబోయి వెన్నుపూస బాగా నొప్పితో సలపడంతో మూలుగుతూ మంచంలోనే కుప్పకూలిపోయింది. ఆ సమయానికి ఇంట్లో అడుగుపెడుతున్న సుశీలక్క జానకి మూలుగు విని పరుగెత్తుకుంటూ వచ్చింది.

"ఏమైంది జానకి" అంటూ ఆత్రుతగా ప్రశ్నించింది.

"ఏమీ లేదక్కా వీపులో కొద్దిగా నొప్పిగా వుంది అంతే" అంటూ నీరసంగా జవాబిచ్చింది.

"అతను రాత్రిగానీ, తెల్లవారివాకగానీ నీతో ఏమన్నా మాట్లాడినాడా జానకీ!"

"నాతో ఇంకేం మాటలక్కా. రాత్రి హోటల్లోనే బాగా తినేసొచ్చి, ఆ వేళప్పుడు అరటిపళ్ళు తిని కిళ్లీ వేసుకొని మరీ పండుకున్నాడు. తెల్లవారివాక నా ముఖం వైపుగా చూడలేదు. చల్లనీళ్ళతోనే స్నానం చేసి, గుడ్డలేసుకొని చక్కా వెళ్ళిపోయాడు" జానకి బాధగా చెప్పింది.

"అంతే జానకీ, ఈ మగవాళ్ళంతా అంతే! ఈ విష పురుగుల్ని కన్నదీ ఆడదే, పెంచిందీ ఆడదే! అయినా, మన కాళ్ళ కింద చెత్తలో పుట్టి పెరిగిన ఈ పురుగుల్ని చూసి మనం భయపడకూడదు. ఎదిరించి నిలబడడం తప్పితే మరో మార్గం లేదు."

సుశీలక్క ఏమేమో చెప్పాలనుకొంటుంది, కాని వివరంగా అర్థమయ్యేలా చెప్పలేక తడబడుతుంది. భర్త శ్రీనివాసరావు ఎన్నో మంచి పుస్తకాలు తెస్తే చదువుతుంది, అర్థం చేసుకొంటుంది. కాని ఇతరులకు చెప్పాలనుకున్నప్పుడు క్రమపద్ధతిలో చెప్పలేక తడబడడం జరుగుతుంది.

ఆ రోజు జానకితో సుశీలక్క చాలా విషయాలు చెప్పింది.

'జానకి' కూడా ఆ రోజు 'సుశీలక్క'తో మనసువిప్పి మాట్లాడింది. తన పుట్టింటి వారి గురించి, వాళ్ళ బాధలు గురించి చెప్పింది. పుట్టింటివారి ఆస్తిలో వాటా పంచుకొని రాలేదని, తన భర్త ఏ విధంగా తనను చిత్రహింసలు పెడుతున్నాడో చెప్పి భోరుమని విలపించింది.

సుశీలక్క సాయంత్రం వరకూ జానకికి ధైర్యం చెబుతూ అక్కడే నిలబడిపోయింది. సాయంత్రం ఆఫీసు నుండి భర్త శ్రీనివాసరావు వస్తే 'టీ' కాచివ్వాలని చెప్పి ఇంటికి వచ్చింది.

సుశీలక్క ఇంటికి వచ్చేటప్పటికి భర్త శ్రీనివాసరావుతో పాటు, అతని స్నేహితుడు కూడా వచ్చి వున్నాడు. వారిద్దరికీ టీ తయారుచేసి ఇచ్చింది. భోజనాలు కూడా రెడీ చేసింది. తర్వాత వారినే వడ్డించుకొని భోజనం చెయ్యమని చెప్పి, జానకి కోసం కొద్దిగా రసమన్నం తీసుకొని వెళ్ళింది.

జానకి చీకట్లో అక్కడే మంచం పైన పడుకొని లేవనే లేదు. సుశీలక్క లైట్ స్విచ్ వేసి జానకిని తట్టిలేపింది.


"జానకీ లెయ్యమ్మా కొద్దిగా రసమన్నం తిందువుగాని లే" అని జానకిని తట్టి లేపింది.

"నాకు ఆకలిగా లేదు, వద్దక్కా" అని నీరసంగా పలికింది జానకి.

"అట్లా అనకూడదమ్మా! నీవు ఒట్టిదానివి కూడా కాదు. నీ కడుపులో బిడ్డ పెరగడానికైనా తినాల... లెయ్యి... ఇదిగో ఈ కాస్త తిను..." అంటూ, ఒత్తిడి చేసి తినిపించింది. సుశీలక్క అట్లా అన్నం తినిపిస్తుంటే జానకికి తన తల్లి గుర్తుకొచ్చింది.

"నా కెందుకో చాలా భయంగా వుందక్కా" జానకి తన మనసులోని ఆందోళనను వ్యక్తం చేసింది.

"ఛీ అట్లా భయపడకూడదు జానకీ, భయపడితే ఏమీ చేయలేం. ధైర్యంగా వుండడం నేర్చుకోవాలి."




"సరే నేను త్వరగా ఇంటికెళ్ళి మరలా వచ్చేస్తానులే" అని చెప్పి సుశీలక్క లేవబోతూ వుంటే రఘునాథం ఇంట్లో అడుగుపెట్టాడు.

సుశీలక్క అతని దిక్కు చూడకుండానే తలవంచుకొని వెళ్ళింది.

"అడ్డమైన లంజలందరికీ నా ఇల్లు ఒక సత్రమైనట్టుంది" రఘునాథం గొణుగుతూ వంటింట్లోకి వెళ్ళినాడు.

రఘునాథం మాటల్ని బట్టి తాగి వచ్చాడని పసిగట్టింది జానకి.

రఘునాథం వంటింట్లో కెళ్ళి పొయ్యి ఖాళీగా వుండడం చూశాడు.

"ఆహా ఎదురింటాడది ఈ దొరసానికి అన్నం తెచ్చి తినిపించిందేమో... ... నీవే అన్నం ఎందుకు చెయ్యలేదు? ఆ... ఎందుకు చెయ్యలేదు?"

రఘునాథం మంచం దగ్గర కెళ్ళి గట్టిగా దబాయించాడు. ఏదో జరగబోతున్నదని ఊహిస్తూ, గజగజ వణికిపోతూ వుంది జానకి.

"పైకి లెయ్యలేకుండా వుండడంతో చేయలేకపోయాను" అంటూ భయంగానే సమాధానం ఇచ్చింది జానకి.

"నువ్వు చేయలేకపోతే నీ అమ్మ వచ్చి చేస్తాదా! లేకపోతే మీ నాయన పెట్టిన పనిమనిషి చేస్తాదంటనే లం... ... ..." అంటూ రఘునాథం జానకి జుట్టు పట్టుకొని మంచం నుండి క్రిందకు పడవేసి బరబరా ఈడ్చాడు.

"నన్ను కొట్టగాకండి, మీకు దండం పెడతానండీ" అంటూ జానకి అతని కాళ్ళు పట్టుకొని బతిమాలింది.

రఘునాథం ఆమె రోదనను ఏ మాత్రం పట్టించుకోక కట్టె తీసుకొని వీపంతా చెంగ్గొట్టేశాడు. జానకి గుడ్డలన్నీ చెదరి వెల్లకిలా పడిపోయింది.

రఘునాథంలోని రాక్షసుడు విశ్వరూపమెత్తాడు. కొట్టడంతోనే ఆగక స్పృహ తప్పిన దానిలా, నిస్సహాయురాలుగా వెల్లకిలా పడి వున్న జానకి ఉబ్బెత్తు కడుపుమీద బలంగా తన్నాడు.

"అమ్మా" అని భయంకరంగా అరచిన జానకి వెర్రి అరుపుకు వీధి వీధంతా మారుమోగింది. జనమంతా బయట వాకిళ్ళలో గుమికూడి ప్రేక్షకుల్లాగా వుండి పోయారు.

రఘునాథం ఆ పైన ఒక్క క్షణమన్నా వుండకుండా బయటకు సరా సరా వెళ్ళిపోయాడు.

సుశీలక్క జనాన్ని తోసుకుంటూ లోపలికి చొచ్చుకొని వెళ్ళింది. అప్పటికే జానకి రక్తపు మడుగులో స్పృహ తప్పిపడి వుంది.

అప్పుడప్పుడే మానవాకృతి రూపుదిద్దుకొంటున్న పిండం ఛిద్రమైపోయి ధారాపాతంగా రక్తం ప్రవహిస్తూ జానకి పాదాలవెంట మడుగుకట్టింది.

మాతృమూర్తి గర్భంలో నవమాసాలు వెచ్చగా గడిపి

తల్లి గర్భాన్ని చీల్చుకుంటూ, పేగు తెంచుకొని పురిటి వాసనంతో భూమిపై పడ్డవాడు పెరిగి పెద్దయి రాక్షసుడిగా మారి, తన జన్మస్థానాన్ని మరచి, జన్మనిచ్చిన సృష్టికర్త స్త్రీ అని గుర్తించి గౌరవించక, మానవతకు జన్మనిచ్చే మరో మాతృమూర్తిని పైశాచికంగా హింసిస్తూ చిత్రవధ చేస్తున్న పురుష అహంకారుల్ని ఏమనాలి!

సుశీలక్క కళ్ళకు జానకి పాదాల దగ్గర మడుగు కట్టిన గర్భస్రావ రక్తంలో జానకి భర్త రఘునాథం రూపం రాక్షసరూపంగా వికటాట్టహాసం చేస్తూ వికృతంగా కనిపించింది.

"సుశీలా! త్వరగా హాస్పిటల్‌కు తీసుకెళదాం పద" అని శ్రీనివాసరావు సుశీలక్కను రెక్కపట్టి కదిపిన తర్వాత గాని ఆలోచనల నుండి తేరుకోలేదు.

సుశీలక్క శ్రీనివాసరావు ఇద్దరూ కలిసి జానకిని ఆటోలో తీసుకొని హాస్పిటల్‌కు వెళ్ళారు.

జానకిని క్యాజువాలిటీ వార్డ్ నుండి స్ట్రెచర్ మీద ఎమర్జెన్సీ ఆపరేషన్ థియేటర్‌కు తరలించారు.

డాక్టర్‌గారు ఆపరేషన్ థియేటర్ నుండి బయటకు వచ్చిన వెంటనే సుశీలక్క, శ్రీనివాసరావు ఇద్దరూ పరుగెత్తుకుంటూ వెళ్ళారు.

"ఎట్లుంది సార్, ప్రమాదం లేదు కదా సార్" ఆతృతగా ఇద్దరూ ఒకేసారి అడిగారు.

"సరే ఆ విషయం తర్వాత చెబుతాను. ముందుగా ఆమెకు మీరు ఏమవుతారో చెప్పండి."

డాక్టర్ చాలా సీరియస్‌గా అడిగాడు.

"ఆ అమ్మాయి నాకు చెల్లెలు సార్" సుశీలక్క భర్తకన్నా ముందే చెప్పింది.

"అయితే ఆమెకు ఈ పరిస్థితి ఎట్లా జరిగిందో వివరంగా స్టేట్‌మెంట్ రాసివ్వాలి మీరు."

డాక్టర్ ఆ మాట చెప్పగానే శ్రీనివాసరావు భయపడి పోయాడు.

భార్యవైపు కోపంగా చూసి 'నువేమీ చెప్పవద్దు' అన్నట్లుగా కన్నులతోనే సైగచేసి తెలిపాడు.

జరిగినదంతా డాక్టరుగారికి తెలపడమే మంచిదనుకున్నాడు శ్రీనివాసరావు.

"మేము ఆమెకు ఏమీ కాము సార్, మేము వాళ్ళింటికి ఎదురుగా వుంటున్నాము. ఈ రోజు ఆమె భర్త ఆమెను బాగా కొట్టాడు. దానితో ఆమె స్పృహ తప్పి పడిపోయింది. రక్తం ఎక్కువగా పోతుంటే ఇక మేమే చూస్తూ వుండలేక ఇక్కడికి తీసుకొని వచ్చాము సార్."

అంటూ డాక్టర్‌కు జరిగిన దాన్ని క్లుప్తంగా వివరించాడు శ్రీనివాసరావు.

"సరే మీరు చూసినదంతా వున్నదున్నట్టు పోలీసులకు వివరించండి. ఇప్పుడు వాళ్ళు ఇక్కడికే వస్తారు... ... ఆ అమ్మాయికి గర్భసంచి పగిలిపోయింది. అందులో పిండం చితికిపోయింది. రక్తం అంతా పోవడంతో ప్రాణాపాయం ఏర్పడింది. చావు బ్రతుకుల్లో వుంది కనుక ఆమె నుంచి మరణ వాంఙ్మూలం అవసరం. అందుకని పోలీసులతో మేజిస్ట్రేట్‌ని పిలిపిస్తున్నాము. వాళ్ళు ఇప్పుడే వస్తారు."

డాక్టర్ చెబుతూ వుంటే సుశీలక్కకు మతి తప్పి పోతున్నట్లుంది. కాని వెంటనే నిలదొక్కుకుంది.

"సార్ ఎట్లైనాగాని ఆమెను బతికించాలి సార్" సుశీలక్క డాక్టర్‌గారికి రెండు చేతులెత్తి మొక్కింది.

"అంతా అయిపోయాక, మేము మాత్రం ఏమి చేయగలమమ్మా" డాక్టర్‌గారు లోపలికెళ్ళి పోయాడు.

జానకి పరిస్థితి చివరి దశలో వుందని తెలిసిపోయి బాధతో ముఖానికి రెండు చేతులూ అడ్డం పెట్టుకొని ఏడ్చేసింది సుశీలక్క.

"సుశీలా ఇక మనం వెడదాం పద. ఇక్కడుంటే మనకు చిక్కులొస్తాయి."

భర్త మాటలకు చివుక్కుమని తల ఎత్తింది సుశీలక్క.

"ఏమవుతుందండీ, సాక్షిగా కోర్టుకు రమ్మంటారు అంతేనా! మనం అది కూడా చేయలేమా? మనందరం చూస్తూ కూడా ఆపిల్లను రక్షించలేకపోయాము. అందుకే కళ్ళుండీ చూస్తూ, నోరుండీ ప్రశ్నించలేని ప్రతివాడూ నేరస్థుడే అవుతాడు. నిజంగానే జానకిని మన ఇంట్లోనే వుంచుకొని రఘునాథాన్ని ఎదిరించగలిగి వుంటే ఈ రోజు జానకికి ఈ పరిస్థితి వచ్చేది కాదు, ప్రాణం పోయేది కాదు" సుశీలక్క చాలా ఆవేశంతో భర్తతో అనేసింది.

"రానివ్వండి మేజిస్ట్రేట్‌గారిని రానివ్వండి జరిగినదంతా వివరించి ఎందుకు ప్రాణం తీశాడో చెప్పగానే ఇక్కడి నుంచి కదలను. అంతగా మీకు భయంగా వుంటే వెళ్ళండి" భర్తవైపు చూడకుండానే అనేసింది.

"మిమ్మల్ని లోపలికి రమ్మంటున్నారు" నర్సు వచ్చి పిలిస్తే సుశీలక్క లోపలికెళ్ళింది.

అప్పుడే చివరి శ్వాస వదులుతున్న జానకిని చూసి, ఆమె రెండు చేతుల్నీ దోసిట్లోకి తీసుకొని నిమురుతూ, "జానకీ! చెల్లీ! నీకు నూరేండ్లు నిండిపోయాయా అమ్మా!" సుశీలక్కకు దుఃఖం కట్టలు తెంచుకొంది.

"జానకి చావలేదు, జానకిని చంపారు... కట్నం కోసం, ఆస్తి కోసం ఆ రఘునాథంగాడు రాక్షసుడు వాడే జానకిని హత్య చేశాడు... ... ... జానకీ నిన్ను మేమే చంపుకున్నామమ్మా! నీకు ఏమీ చేయలేకపోయాం తల్లీ!... మన పిరికితనమే నీపాలిట చావు తల్లీ..."

సుశీలక్క హాస్పిటల్లో పిచ్చిదానిలా రోదించింది. నర్సు ఆమెను అక్కడి నుండి పక్కకు నడిపించింది.

మానవత్వం మంటకలిసిన అనాగరిక సభ్య ప్రపంచం నుంచి జానకి శాశ్వతంగా నిష్క్రమించింది.

దుఃఖంతో భూమి తల్లి మరింత కృంగిపోయింది.

'జానకి' చావును చూసి మరోసారి 'మానవత' సిగ్గుతో తలవంచుకొంది.

